క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన వడ్డే నర్సింహులు ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోతురాజు సోమనాద్రి సూచన మేరకు సేవాదళ్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు, తదితరులు ఉన్నారు.

హీరోను కలిసిన సేవా సమితి సభ్యులు



శాంతినగర్: ఇటీవల విడుదలైన మైకేల్ గ్యాంగ్ సినిమా హీరో సాయిచరణ్‌తేజ్‌ను శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, మాలిక్‌లు కర్నూలులోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. సినిమాకు సంబంధించిన షూటింగ్ ఎక్కువ శాతం పట్టణ పరిసరాలలో జరగటం, సినిమాలో హీరో సాయిచరణ్‌తేజ్ నటన నచ్చడంతో హీరోను కలిసి వారు శుభాకాంక్షలు తెలిపారు. హీరోగా మరెన్నో సినిమాలు నటించి నటుడిగా మంచి గుర్తింపు పొందాలని సేవాసమితి సభ్యులు ఆకాంక్షించారు.

నైవేద్య బియ్యం లెక్కింపు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు స్వామి వారికి సమర్పించిన నైవేద్య బియ్యంను ఆదివారం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకుల సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా 43 క్వింటాళ్ల 50 కిలోల బియ్యం, క్వింటాన్నర కందిపప్పును భక్తులు స్వామివారికి సమర్పించినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, బాబురావు, వాల్మీకీ పూజారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అధిక సంఖ్యలో తరలిరండి



గద్వాల అర్బన్: ఈనెల 13, 14వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పన్న కోరారు. ఆదివారం ఈ సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి చక్రధర్, కార్యదర్శులు మద్దిలేటి, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



కొత్తకోట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 'గాడ్స్ ఆఫ్ వారియర్స్ షోటోఖాన్' కరాటే ఆకాడమీకి చెందిన విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్టు మాస్టర్ అబ్దుల్ నబీ తెలిపారు. పట్టణ కేంద్రంతో పాటు పాలెం, రామనంతాపురం, మదనాపురానికి చెందిన 100మంది విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో పాల్గొన్నారు. కిక్స్, కటాస్, కుమితే, కాంబినేషనర్స్, బ్యాలెన్స్, జంపింగ్‌నేషన్ వంటి విభాగాల్లో పరీక్షలు నిర్వహించగా, ఎల్లో బెల్ట్ 30 మంది, గ్రీన్ బెల్ట్ 20 మంది, ఆరెంజ్ బెల్ట్ 25మంది, బ్లూ బెల్ట్ 20మంది, మెరూన్ బెల్ట్ ముగ్గురు, బ్రౌన్ ఇద్దరు ఉన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు జాఫర్, హరీష్‌యాదవ్, సాధిక్, పరమేష్, జాంగీర్, ఇంతియాజ్, మంజునాథ్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?

- నత్తనడకన మిషన్ భగీరథ పనులు
- పూర్తికాని పైప్‌లైన్ పనులు
- పట్టించుకోని అధికారులు

అయిజ: ప్రతి ఇంటికి శుద్ధజలం అందించాలన్నా సంకల్పంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అవసరమైన నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో పనులు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంది. కాని రెండేళ్ల కిందట పనులు ప్రారంభించినా పనులు నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి. సంవత్సరంలోపు పూర్తికావల్సి ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఎట్టకేలకు వాటర్ ట్యాంక్‌లు(ఓహెచ్ఎస్ఆర్) నిర్మాణాలు పూర్తి చేశారు. పైప్‌లైన్ పనులు పూర్తికాకపోవడంతో సమస్య మొదటికే వచ్చింది.

ప్రణాళికా లోపం

మున్సిపాలిటీలో మిషన్ భగీరథకు సంబంధించి మొత్తం 5 వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయి. ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్ల అందించేందుకు పట్టణంలో గత సంవత్సరం నుంచి పైప్‌లైన్ వేస్తున్నారు. ప్రణాళిక లేకపోవడంతో ఇప్పటికి పనులు పూర్తికాలేదు. గతంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు పనులు పూర్తిచేయకపోవడంతో అధికారులు వారి కాంట్రాక్ట్‌ను రద్దు చేసి వేరే కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. అయినా సరే మిషన్ భగీరథ పనులు పూర్తికాకపోవడంతో పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పనులు పూర్తికావడానికి ఎన్నిరోజులు పడుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనులతో స్థానికులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇప్పటికి పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాహనదారుల తిప్పలు అంతా ఇంతా కాదు. ఇంటిముందు తవ్విన గుంతలకే వాహనాలను ఇంటిముందే నిలపాల్సిన దుస్థితి ఏర్పడిందని వాహనదారులు వాపోయారు. ఎప్పుడు నల్లా కనెక్షన్ ఇస్తారో ఎవరికి అర్థం కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మిషన్ భగీరథ పనులు ఆలస్యం అవుతున్నాయని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో మిషన్ భగీరథ పనులు చేపట్టారు. కాలనీలలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పైప్‌లైన్ ఏర్పాటు కోసం తీసిన గుంతల కారణంగా రోడ్లు కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. పైప్‌లైన్ వేసేందుకు తవ్విన గుంతల్లో మట్టి వేసి పూడ్చారు. దీంతో సీసీ రోడ్లన్ని శిథిలమయ్యాయి. సీసీ రోడ్లను పగులగొట్టడంతో పెచ్చులు రోడ్డుపై మిగిలిపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మోటార్ సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాళికామాత ఆలయం నుంచి పాతబస్టాండ్ చౌరస్తా వరకు మాత్రమే పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు.

పూర్తికాని పైప్‌లైన్

మిషన్ భగీరథ పనులు ప్రారంభించిన సంవత్సరం కాలంలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంకా రోడ్లను తవ్వే పనులు కూడా మిగిలే ఉన్నాయి. పట్టణంలో మూడు ప్రదేశాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. పీహెచ్‌సీ వద్ద నిర్మిస్తున్న 1200 కేఎల్ ట్యాక్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద నిర్మించే 500 కేఎల్ వాటర్ ట్యాంక్ నిర్మాణం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించే 200 ఏఎల్ వాటర్ ట్యాంక్ పనులు పూర్తికావొచ్చాయి.



కమతం పేటలో సీసీ రోడ్డు ఇలా..

మరో నాలుగు నెలలు..

పైప్‌లైన్ పనులు పూర్తయినాసరే ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చిన అనంతరం మూడు నెలల పాటు వాటిని పరిశీలించాల్సి ఉంటుంది. ఎక్కడైన లీకేజీ ఉన్నా, పైప్‌లైన్‌లు పూడిపోయినా, ఇతర సమస్యలు ఎదురైనా వాటికి మరమ్మతు చేపట్టాల్సి ఉంటుంది. మూడు నెలల అనంతరం రోడ్లపై ప్యాచ్ వర్క్స్ చేయాల్సి ఉంటుంది. అంతవరకు పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురికాకతప్పదు. అధికారులు స్పందించి పట్టణ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం



మిషన్ భగీరథ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో తాగునీటికి కష్టాలు పడుతున్నాం. పనులు నిదానంగా చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. పైప్‌లైన్‌లు అనేక చోట్ల లీకవుతున్నాయి. దానివలన తాగునీరు కలుషితమవుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేయాలి.

– రమేష్, అయిజ

అధికారులు పట్టించుకోవడం లేదు



పైప్‌లైన్ పనులు ఇప్పటికి పూర్తికాలేదు. పైప్‌లైన్ నిర్మాణం కోసం సీసీ రోడ్లు తవ్వి వదిలేశారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల మాత్రమే ప్యాచ్ వర్క్ చేశారు. అన్ని కాలనీల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు వేయలేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకులు చొరవ తీసుకొని పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– రాఘవేంద్ర, అయిజ

రెండు నెలల్లో పూర్తిచేస్తాం



పైప్‌లైన్ పనులు పూర్తికావొచ్చాయి. దాదాపు అన్ని కాలనీల్లో కుళాయిలు అమర్చాం. లీకేజీలు పరిశీలించేందుకు తవ్విన గుంతలకు ప్యాచ్ వర్క్ చేయలేదు. అనేక చోట్ల పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించాం. వాటన్నింటికి మరమ్మతు చేపట్టిన అనంతరం ప్రతి రోజు తాగునీటి సరఫరా చేస్తాం. మరో రెండు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

– గోపాల్, మున్సిపల్ ఏఈ

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల గిరక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాముశెట్టి

గట్టు: మండలంలోని ఆలూరులో ఆదివారం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల గిరక పోటీలను గద్వాల ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాముశెట్టి, సర్పంచు మల్లమ్మ, మాజీ సర్పంచు నర్సన్‌గౌడులు ప్రారంభించారు. ఆంజనేయస్వామి జాతర సందర్భంగా ఎడ్లబండ్ల గిరక పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 18 జతల ఎడ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎడ్ల బండ్ల పోటీలకు జిల్లాతో పాటుగా ఆత్మకూరు, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనంద్‌గౌడు, బీఆర్ఎస్ నాయకులు మేస్త్రీ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



గ్రామస్తులతో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

ధరూరు: గ్రామాలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వామన్‌పల్లిలో పల్లె నిద్ర చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలోని కాలనీల్లో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సొంత ఖర్చులతో వివిధ పనులు చేసినా బిల్లులు రావడం లేదని సర్పంచు విన్నవించారు. గ్రామ పంచాయతీకి సొంత భవనం లేదని వివరించారు. ఏకగ్రీవంగా ఎన్నికై నప్పటికీ రూ.25లక్షల ప్రభుత్వ ప్రోత్సాహం అందలేదన్నారు.అనంతరం రంజిత్‌కుమార్ మాట్లాడుతూ డ్రెయినేజీలు లేక మురుగురోడ్లపైనే పారుతుందన్నారు. రుతోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మరో 15 రోజుల్లో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోవిందు, ఉపాధ్యక్షుడు మునెప్ప, రంగస్వామి, నాయకులు రఘు, సుదర్శన్, విష్ణు, నరిపంహులు, అశోక్, తిమ్మప్ప, ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ధరూరు(కేటీదొడ్డి): జంగిల్ సాబ్ ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని కేటీదొడ్డి మండలంలోని ఇర్కిచేడులో రెండు రోజులుగా నిర్వహించిన సండె రాళ్లు ఎత్తు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేవారు. సర్పంచు మాధవికు లక్ష్మి ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా వీరేష్‌కు రూ.5000 వేలు, రెండవ బహుమతిగా తెలుగు రాముడు రూ.3000 వేలు, మూడో బహుమతి తిరుమల్ రూ. 2000 వేలు, నాలుగొవ బహుమతి విక్రమంసింహారెడ్డిలు రూ.1000లు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా పాల్వాయి లక్ష్మీనారాయణ



ఎన్నికైన సోషల్ ఫోరం కమిటీ నాయకులు

గద్వాల: నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం జిల్లా నూతన కార్యవర్గంతో పాటు మండలాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్‌లు మరోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా భాస్కర్, షాలం, రేణుక, సాయన్న, నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా సంతోషమ్మ, ఉషారాణి, రజియాబేగం, మీడియా ఇన్‌చార్జిగా రాజుసాగర్‌లను ఎన్నికయ్యారు. గట్టు మండలానికి పరుశరామ్, అశోక్, ధరూర్ మండలానికి శ్రీనివాసులు, రామచంద్రయ్య, మల్దకల్ మండలానికి రాజు, గోవిందు, గద్వాల మండలానికి నాగరాజు, రాముడు, కేటీదొడ్డి మండలానికి ఈదన్న, నారాయణలు ప్రతినిధులుగా నియామకం అయ్యారు. అలాగే ఇటిక్యాల మండలానికి శ్రీహరి, చంద్రన్న, మానవపాడు మండలానికి చంద్రశేఖర్, రాధాకృష్ణరెడ్డి, ఉండవెల్లి మండలానికి వెంకటేష్, మద్దిలేటి, వడ్డేపల్లి మండలానికి జనార్దన్, కృష్ణస్వామి, అలంపూర్ మండలానికి బషీర్ అహ్మద్, మల్లయ్య, ఐజ మండలానికి లక్ష్మిరెడ్డి, రామాంజనేయులు, రాజోళి మండలానికి వెంకటేశ్వర్‌శెట్టి, మాసూమ్‌లు ప్రతినిధులు ఎన్నికయ్యారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ఉండవెల్లి మండలం పుల్లూరులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గజేందర్ రెడ్డి

మల్దకల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్–6 క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అదేవిధంగా క్రికెట్, కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, నాయకులు పెద్ద వీరన్న, వెంకటన్న, అజయ్, చక్రాధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహ్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, మధు, నారాయణ, ఆంజనేయులు, భాస్కర్‌గౌడ్, తిమ్మరాజు, కురుమన్న, పరుశరాముడు, పాల్గొన్నారు.

మానవపాడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీఐ శివశంకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని అమరవాయిలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎస్ఐ సంతోష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సీఐ, ఎస్ఐలను యువశక్తి యూత్ సభ్యులు రమేష్, సాధిక్, రవి, సిరాజ్‌లు సన్మానించారు. కార్యక్రమంలో యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మల్దకల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ శేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, పరుగు పందెం పోటీలు ముగిసాయి. వాలీబాల్‌లో ఎల్కూరుకు చెందిన జట్టు విజేతగా నిలిచింది. కుర్తిరావులచెర్వుకు చెందిన యువకుడు పరుగుపందెంలో మొదటి విజేతగా నిలిచాడు. గెలుపొందిన విజేతలకు మెమెంటోలను అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్, పోలీసు సిబ్బంది , నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: క్రీడాస్ఫూర్తిని చాటాలని పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పుల్లురులో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్– 7 క్రీడా పోటీలను ఆయన తిలకించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని కోరారు.



మానవపాడు అమరవాయిలో క్రీడాకారులతో సీఐ, ఎస్ఐ

వాల్ పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గద్వాల అర్బన్: కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రథమ మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం మండలంలోని గోన్‌పాడులోని కేజీబీవీ హాస్టల్‌లో ఈ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహులు, వర్కర్లు ఈరమ్మ, అరుణ, కమ్మలమ్మ, గీత, రాధ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరచింత: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ డాక్టర్ మాలతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కంటివెలుగుపై అవగాహన...

ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11గంటలకు కంటివెలుగు కార్యక్రమంపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. అవగాహన కార్యక్రమం అనంతరం సర్వసభ్య సమావేశం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఆదిశిలా క్షేత్రంలో హుండీ లెక్కింపు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం ఉదయం 11 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈఓ సత్యశ్చంద్రారెడ్డిల పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప దేవర ఉత్సవాలు



ఆత్మకూర్‌లో పల్లకీసేవ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: కురుమ కులస్తుల ఆరాధ్యదైవం బీరప్ప స్వామి దేవర్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూర్, ఖానపూర్ గ్రామాలకు చెందిన కురుమలు తెల్లవారుజామున ఊరేగింపుగా కృష్ణానదికి వెళ్లి అక్కడ విగ్రహాలను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో పట్టణ పురవిధులగుండా ఊరేగింపుగా ఆలయాలకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లేష్, చింతలన్న, కుర్వరవి, అనంతరాములు, సుధీర్, జీవేంద్రుడు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: బీరప్ప దేవర్ల ఉత్సవాలను కురువ కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందే తమ కుల దేవర్లను భక్తిశ్రద్ధలతో పూజించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని సంఘం పెద్దలు వెల్లడించారు. ఆదివారం బీరప్ప స్వామి ఆలయంలో పూజలను నిర్వహించి దేవర్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉరేగించారు. కార్యక్రమంలో పూజారి గోపి, కుర్వ వీరేష్, రాము, కురుమన్న, తిమ్మన్న, ఈదన్న, రవి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గద్వాలలో..



అయిజలో గురువులతో పూర్వ విద్యార్థులు

గద్వాల: ఎంఏఎల్‌డీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1974–76లో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడుని పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. వృత్తులు, వ్యాపకాలు, కుటుంబ నేపథ్యం, పిల్లల చదువులు, బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని కళాశాల అనుభూతులను గుర్తు చేసుకున్నారు. ఆనాడు తరగతి గదిలో కలిసిన విద్యార్థులంతా ఒకచోట కలవడంపై సంతోషం వ్యక్తం చేశారు.

1986–87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మండలంలోని స్థానిక బుర్దపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1986–87 బ్యాచ్‌కు విద్యార్థులు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రసాదు, రవికుమారు, ప్రదీప్, రఘు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–2003 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఉత్సాహంగా గడిపారు. గురువులను శాలువాలు, పూలమాలతో సత్కరించారు.